బీఆర్ ఎస్ దుకాణం బంద్ చేసే ఆలోచనలో బీజేపీ...!



4లో.

RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

అనుక్షణం ప్రజలపక్షం...

తెలుగు దినపత్రిక

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
KKR NEWS
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 154 మంగళవారం 27 ఫిబ్రవరి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## ప్రియాంక గాంధీ పర్యటన రద్దు



రెండు గ్యారెంటీలను ప్రియాంక చేతుల మీదుగా అమలు చేయాలని భావించిన తెలంగాణ కాంగ్రెస్

ఈ నెల 27న ప్రియాంక గాంధీ షెడ్యూల్ ఖరారు

వర్చువల్‌గా గ్యారెంటీలను ప్రారంభించనున్న ప్రియాంక గాంధీ

**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీ తెలంగాణ పర్యటన రద్దయింది. ఈ నెల 27న ప్రియాంక గాంధీ చేతుల మీదుగా చేవెళ్ల బహిరంగ సభ వేదికగా రెండు గ్యారెంటీలను ప్రారంభించాలని కాంగ్రెస్ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. కానీ అనివార్య కారణాలతో రేపటి ఆమె పర్యటన రద్దయింది. అయితే ఆమె వర్చువల్‌గా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ గ్యారెంటీలను ప్రారంభించనున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను ప్రకటించింది. ఇందులో ఇప్పటికే రెండు గ్యారంటీలను పాక్షికంగా అమలు చేశారు. రేపు మరో రెండు గ్యారెంటీలను అమలు చేయనున్నారు.

# పన్ను వసూళ్ళలో వార్షిక లక్ష్యాన్ని సాధించండి

- ఏళ్లుగా తిష్టవేసిన అధికారులను బదిలీ చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి
- నిర్దేశిత లక్ష్యం మేరకు పన్ను వసూలు సాధించాలని అధికారులకు సూచన
- నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణా అరికట్టాలని ఆదేశాలు
- వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖకు సొంత భవనాలు ఉండాలన్న సీఎం
- సమగ్రమైన ఇసుక విధానంతో అక్రమాలను అడ్డుకోవాలని సూచన
- గనుల శాఖ విధించిన జరిమానాలు వసూలు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** టీఎస్ ఎండీసీతో పాటు గనులశాఖలో పలువురు అధికారులు ఒకే పోస్టులో ఏళ్ల తరబడి తిష్ట వేశారని, కొందరిపై ఆరోపణలు ఉన్నాయని, అలాంటి వారిని వెంటనే బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆదేశించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, రిజిస్ట్రేషన్లు, రవాణా, గనులు, భూగర్భ వనరుల శాఖ పన్ను వసూళ్లపై సచివాలయంలో ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... పన్ను వసూళ్లలో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని అన్ని శాఖలు సాధించాలన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో పన్ను లక్ష్యానికి, రాబడికి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఎందుకు ఉంది? అని సీఎం ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది వరకు జీఎస్టీ పరిహారం కింద రూ.4 వేల కోట్లకు పైగా చెల్లించేదని, దాని గడువు ముగియడంతో ఆ నిధులు రాకపోవడంతో రాబడిలో వ్యత్యాసం కనిపిస్తోందని అధికారులు తెలిపారు.

పొరుగు రాష్ట్రాల నుంచి నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ మన రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సీఎం ఆదేశించారు. మద్యం సరఫరా, విక్రయాలకు సంబంధించి లెక్కల్లో తేడాలు ఉంటున్నాయని, వీటిపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి డిస్టలరీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సరఫరా వాహనాలకు జీపీఎస్ అమర్చి వాటిని ట్రాకింగ్ చేయాలని, బాటిల్ ట్రాకింగ్ సిస్టం ఉండాలని, మద్యం సరఫరా వాహనాలు వే-బిల్లులు కచ్చితంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తో పాటు గతంలో నమోదు చేసిన పలు కేసుల పురోగతిపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో.

# కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

**లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే ఒరిగేదేమీ లేదు... : కిషన్ రెడ్డి**

భాగ్యలక్ష్మి విజయ సంకల్ప యాత్రలో కిషన్ రెడ్డి

లోక్ సభ ఎన్నికల్లో ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించాలని కోరిన కిషన్ రెడ్డి

మోదీ అభివృద్ధి, సంక్షేమంతో పాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ జాతి గౌరవాన్ని పెంపొందించారని వ్యాఖ్య



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయడం వల్ల ఒరిగేదేమీ లేదని, అలాగే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపించడం లేదని కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. కలిసి నడుద్దాం... నరేంద్ర మోదీని మరోసారి గెలిపిద్దాం అనే నినాదంతో తెలంగాణ బీజేపీ ఆయా జిల్లాల్లో విజయ సంకల్ప యాత్రలను నిర్వహిస్తోంది.

మిగతాది 2లో...

# విచారణకు ఏడోసారి కేజ్రీవాల్ డుమ్మా

## ప్రతిరోజూ సమన్లు జారీ చేయడం



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ స్కామ్ లో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఈడీ ఏడోసారి సమన్లు జారీ చేసింది. ఈరోజు కూడా ఆయన సమన్లకు ప్రతిస్పందించలేదు. ఈడీ విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆప్ స్పందిస్తూ... ప్రతిరోజూ సమన్లు జారీ చేయడం సరికాదని వ్యాఖ్యానించింది. రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు వెలువడేంత వరకు వేచి ఉండాలని సూచించింది. మార్చి 16న కోర్టులో విచారణ ఉందని.. అంతవరకు సంయమనం పాటించాలని కోరింది. తమపై ఎంత ఒత్తిడి చేసినా... ఇండియా కూటమిని ఆప్ వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. గత వారం కూడా కేజ్రీవాల్ కు ఈడీ సమన్లు జారీ చేసింది. గత సోమవారం తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. అయితే, అప్పుడు కూడా ఈడీకి ఆప్ ఇదే సమాధానం ఇచ్చింది. మరోవైపు, కేజ్రీవాల్ విచారణకు హాజరు కాకపోవడంతో ఈడీ స్పందిస్తూ... కుంటి సాకులు చెపుతూ విచారణ నుంచి తప్పించుకుంటున్నారని విమర్శించింది. ప్రజా జీవితంలో అత్యున్నత స్థాయిలో ఉన్న వ్యక్తులే చట్టాలను గౌరవించకపోతే... అది సామాన్య ప్రజలకు చెడు సంకేతాలను పంపుతుందని వ్యాఖ్యానించింది.

# మల్టీజోన్-1 ఐజీగా ఏవీ రంగనాథ్..

## మరో ఇద్దరు ఐపీఎస్‌ల బదిలీ



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ముగ్గురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం హైదరాబాద్ సీసీఎస్ జాయింట్ కమిషనర్‌గా ఉన్న ఏవీ రంగనాథ్ మల్టీజోన్-1 ఐజీగా నియమించారు.ట్రాఫిక్ అదనపు సీపీగా ఉన్న విశ్వప్రసాద్‌ను ఆర్గనైజేషన్ ఐజీగా, మధ్య మండల డీసీపీగా ఉన్న శరత్ చంద్ర పవార్‌ను టీఎస్ న్యాబ్ ఎస్పీగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల బీమా

**కేసీఆర్ చేసిన అప్పులతో తెలంగాణ తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లింది**

**ఆరు గ్యారెంటీలపై ఎలాంటి అపోహలు వద్దన్న రేవంత్ రెడ్డి**

**మార్చి 31వ తేదీ లోగా రైతు బంధు ఇస్తామని ఇప్పటికే చెప్పామన్న సీఎం**



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ చేసిన అప్పులతో తెలంగాణ రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సింగరేణి ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకం ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... ఆరు గ్యారెంటీలపై ఎలాంటి అపోహలు వద్దన్నారు. మార్చి 31వ తేదీ లోగా రైతు బంధు ఇస్తామని ఇప్పటికే చెప్పామని, కానీ బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. రేపు మరో రెండు పథకాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.కేసీఆర్ తెలంగాణను అప్పుల ఊబిలో ముంచేశారని ఆరోపించారు. తాము క్రమంగా ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుతున్నామని తెలిపారు. ఇంతటి ఆర్థిక సంక్షోభంలోనూ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్యారెంటీల అమలు నిరంతర ప్రక్రియ అని తేల్చి చెప్పారు. ఆరు గ్యారంటీలను ఒక్కటొక్కటి అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజలకు వివరిస్తామన్నారు.

# పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల




తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి.

## పదో తరగతి పరీక్షల షెడ్యూల్:

- **మార్చి 18 - ఫస్ట్ లాంగ్వేజ్**
- **మార్చి 19 - సెకండ్ లాంగ్వేజ్**
- **మార్చి 21 - థర్డ్ లాంగ్వేజ్**
- **మార్చి 23 - గణితం**
- **మార్చి 26 - ఫిజిక్స్**
- **మార్చి 28 - బయాలజీ**
- **మార్చి 30 - సోషల్ స్టడీస్.**

# కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు

**(మొదటి పేజి తరువాయి)**
ఇందులో భాగంగా భాగ్యలక్ష్మీ క్లస్టర్ అమీర్‌పేట బహిరంగ సమావేశంలో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని పద్మారావు నగర్, బైబిల్ హౌస్, మహంకాళి వీధి, మోండా మార్కెట్, బేగంపేట ప్రాంతాల్లో రోడ్డు షో నిర్వహించారు.ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... లోక్ సభ ఎన్నికల్లో ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మూడోసారి మోదీని ప్రధాని పీఠంపై కూర్చోబెట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అవినీతిరహిత పరిపాలన సాగిస్తూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటిన గొప్ప నాయకుడు మోదీ అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తూ జాతి గౌరవాన్ని పెంపొందించినట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారుల విస్తరణ, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, విమానాశ్రయాల పెంపు, పేదలందరికీ నాణ్యమైన బియ్యం, కరోనా వ్యాక్సీన్ పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు మోదీ హయాంలో అమలు అయ్యాయన్నారు. మోదీ పాలనలో అన్ని వర్గాల వారు సంతోషంతో ఉన్నారన్నారు.

# పన్ను వసూళ్ళలో వార్షిక లక్ష్యాన్ని సాధించండి

**(మొదటి పేజీ తరువాయి)**
రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్ష సందర్భంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. అదే సమయంలో తమ శాఖలోనూ అదే పరిస్థితి నెలకొందని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆదాయాన్ని తెచ్చే శాఖలకు సొంత భవనాలు ఉండాలని, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా నూతన భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌తో పాటు నగరంలో పలు ప్రాంతాల్లో రహదారులపై కంకర కుప్పలుగా పోసి విక్రయిస్తున్నారని, అలా కాకుండా నగరంలో వివిధ ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలాలను వినియోగించాలని సూచించారు.ఇసుక విక్రయాలపై సమగ్ర విధానం రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వే-బిల్లులతో పాటు ఇసుక సరఫరా వాహనాలకు ట్రాకింగ్ ఉండాలని, అక్రమ రవాణాకు అవకాశం ఇవ్వవద్దన్నారు. నిబంధనల ఉల్లంఘన కింద పలు గనులపై గతంలో జరిమానాలు విధించారని, కేసులు నమోదు చేశారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఈ జరిమానాలను వెంటనే వసూలు చేయాలన్నారు. గతంలో జరిమానాలు విధించి తర్వాత వాటిని తగ్గించారని, అందుకు కారణాలు ఏమిటో తెలియజేస్తూ నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు.

## రెండు గ్యారెంటీల అమలు...
# ప్రభుత్వ ఆహ్వాన పత్రిక




**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ ప్రభుత్వం మరో రెండు పథకాలను మంగళవారం ప్రారంభించనుంది.
కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు ఇచ్చింది. ఇందులో ఇప్పటికే కొన్నింటిని అమలు చేశారు. తాజాగా మరో రెండు పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు సాయంత్రం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వాన లేఖను విడుదల చేసింది.గృహ జ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమం రేపు సాయంత్రం 4 గంటలకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఫరా ఇంజినీరింగ్ కాలేజీలో జరగనుందని ఆహ్వాన పత్రికలో పేర్కొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి వస్తున్నారని, విశిష్ట అతిథిగా మల్లు భట్టి విక్రమార్క వస్తున్నట్లు పేర్కొంది. సభాధ్యక్షులుగా ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యవహరించనున్నట్లు ఆహ్వాన పత్రికలో పేర్కొన్నారు.

# పచ్చదనంతోనే మానవ జీవితానికి పరిపూర్ణత

### అటవీ శాఖపై మంత్రి కొండా సురేఖ ఉన్నత స్థాయి సమీక్ష
### ములుగు ఫారెస్ట్ కాలేజ్ తేనెటీగల కేంద్రం "వైల్డ్ ఫ్లేవర్స్"ను ఆవిష్కరించిన మంత్రి

**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** ప్రకృతే శాశ్వతం, పచ్చదనంతోనే మానవ జీవితానికి పరిపూర్ణత అని, మానవ మనుగడ పచ్చని అడవులు, మంచి పర్యావరణంపైనే ఆధారపడి ఉందని అటవీ, పర్యావరణం, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అడవుల రక్షణ కోసం అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని, తమది ఉద్యోగుల స్నేహ పూర్వక ప్రభుత్వమని, సమస్యలు ఉంటే ఓపెన్‌గా చెప్పాలని మంత్రి అన్నారు. అటవీశాఖ ప్రధాన కార్యాలయం అరణ్య భవన్ వేదికగా సోమవారం మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన అటవీశాఖపై రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి అరణ్యభవన్‌కు వొచ్చిన మంత్రికి అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్, ఇతర ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ..తమది ఉద్యోగులతో స్నేహపూర్వకంగా ఉండే ప్రభుత్వమని, అధికారులు, సిబ్బంది తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకోవచ్చని అన్నారు. క్షేత్ర స్థాయి అధికారుల చెప్పిన విషయాలను ఓపికగా విన్న మంత్రి తన తండ్రి ప్రభుత్వ ఉద్యోగిగా రోడ్లు, భవనాల శాఖలో పనిచేశారని, ప్రభుత్వ ఉద్యోగుల కష్ట సుఖాలు తనకు తెలుసునని అన్నారు.అదే




సమయంలో ప్రతీ అధికారి కుటుంబంతో సహా పనిచేసే ప్రదేశంలోనే నివాసం ఉండాలన్నారు. అడవుల రక్షణ అనేది అన్నింటికంటే ముఖ్యమైన విధి అని, రానున్న రోజుల్లో అత్యంత సవాల్‌తో కూడిన ఈ బాధ్యతలను అందరూ సమర్ధవంతంగా నెరవేర్చాలన్నారు. ఇటీవల కాగజ్ నగర్‌లో పులుల మరణం తనను కలిచివేసిందని, రానున్న రోజుల్లో అలాంటి సంఘటనలు జరగకూడదని అన్నారు. అడవుల రక్షణపై కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అటవీ రక్షణ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరగాలని అన్నారు. గత ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటామని చెప్పినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. తెలంగాణ స్థానిక జాతులు చెట్ల విత్తనాలు సేకరించి, మెరుగైన మొక్కలను నర్సరీల్లో పెంచాలన్నారు. చింత, జామ, నేరేడు, రేగు, సీతాఫలం, మునగ లాంటివి పెంచటం వల్ల అటవీ జంతువులు బయటకు రాకుండా ఉంటాయన్నారు. హరితహారం వొచ్చే సీజన్‌పై జిల్లా సమీక్షా సమావేశాలు జరిపి లక్ష్యాలతో పాటు, అవసరమైన మెటీరియల్ ను సిద్ధం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో మిగతా పట్టణ ప్రాంతాలతో పాటు ట్రై సిటీస్‌గా ఖ్యాతిగాంచిన వరంగల్, హన్మకొండ, ఖాజీపేట మూడు నగరాల్లో పచ్చదనం పెంపు, పార్కుల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యతను ఇస్తామని, అదే సమయంలో చట్ట వ్యతిరేకంగా అడవుల ఆక్రమణ చేపడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. అడవుల ఆక్రమణను సహించమని, గుత్తికోయ ప్రభావిత ప్రాంతాల్లో తదుపరి ఆక్రమణలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఇతర శాఖల మద్దతు కూడా తీసుకోవాలని సూచించారు.

# రైతు బంధు, రైతు బీమా పేరుతో కుంభకోణం

**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
నకిలీ పత్రాలు సృష్టించి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన ఇద్దరు నిందితులను సైబరాబాద్ ఈఓడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. రెండు మొబైల్ ఫోన్లు, బ్యాంక్ డెబిట్ కార్డులు 7, నకిలీ డెత్ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి అవినాష్ మహంతి వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా, కొందుర్గు మండలం, అగ్రియాల్ క్లస్టర్‌లో గోరేటి శ్రీశైలం అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా 2017 నుంచి పని చేస్తున్నాడు, ఓదేలా వీరస్వామి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గోరేటి శ్రీశైలం ఎఈఓగా పనిచేస్తుండడంతో రైతుబంధు, రైతు బీమా గురించి పూర్తి వివరాలు తెలియడంతో మృతి చెందిన, అర్హతలేని రైతుల వివరాలు తెలుసుకున్నాడు. అలాగే 60ఏళ్ల




దాటిన వారి వివరాలు తీసుకుని నకిలీ డెత్ సర్టిఫికెట్, నకిలీ ఆధార్‌కార్డు తీసుకుని రైతు బీమా డబ్బుల కోసం ఎల్ఐసికి పంపించేవాడు. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం డ్రైవర్ వీరస్వామి బ్యాంక్ ఖాతాలు, సిమ్‌లను ఇవ్వడంతో బీమా డబ్బులు పడగానే బ్యాంక్ నుంచి డ్రా చేసేవాడు.
ఇలా 20 మంది రైతుల బీమా డబ్బులను తీసుకున్నాడు. రైతుల బీమా డబ్బులు సుకునేందుకు ఎఈఓ తొమ్మిది బ్యాంక్ ఖాతాలను ఉపయోగించాడు. ఈ నేపథ్యంలోనే రైతు బీమా డబ్బులు ఎల్ఐసి నుంచి కోటి రూపాయలు డ్రా చేశాడు. ముందుగానే చేసుకున్న ఒప్పందం మేరకు ఎల్ఐసి అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్ లేకపోవడంతో ఎఈఓ దానిని ఉపయోగించుకుని డబ్బులు స్వాహా చేశాడు. రైతుబంధు పేరుతో 130 మంది పేరిట నిధులు మళ్లించాడు. రైతుల పట్టాదార్ పాస్‌బుక్ మొదటి పేజీని తీసుకుని దానిని ఎడిట్ చేసేవాడు. రైతు బంధు పడేవిధంగా దానికి తన వద్ద ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్‌ను ఎంటర్ చేసేవాడు. ఇలా 130మంది రైతుల రైతు బంధు డబ్బులను తీసుకున్నాడు. రెండు స్కాంలను కలిసి రూ.2 కోట్లు కోట్టేశాడు. ఈ వ్యవహారం మొత్తం ఎఈఓ భార్యకు కూడా తెలుసని, ఆమెపై కూడా కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్సై అనిల్‌కుమార్ తదితరులు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. నిందితులపై 409, 420,467,468,471,477ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## భార్యల చేతుల్లో చావుదెబ్బలు తింటున్న భర్తలు
# తెలంగాణలోనే ఎక్కువట!

- వెల్లడించిన రీసెర్చ్ సంస్థ బయో సోషల్ స్టడీస్
- అధ్యయనాన్ని ప్రచురించిన కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్
- చావుదెబ్బలు తింటున్న వారిలో తాగుబోతులు, నిరక్షరాస్యులే ఎక్కువ
- భారత్‌లో పురుషులకు రక్షణ చట్టాలు లేకపోవడమే కారణమన్న అధ్యయనం



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** మీరు చదివింది నిజమే! భార్యల చేతుల్లో చావుదెబ్బలు తింటున్న భర్తల సంఖ్య తెలంగాణలోనే ఎక్కువట. బయో సోషల్ స్టడీస్‌లో అనే రీసెర్చ్ సంస్థ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. తన్నులు తింటున్న వారిలో తాగుబోతులు, నిరక్షరాస్యుల సంఖ్యే ఎక్కువట. దేశంలో భర్తలపై జరుగుతున్న గృహహింసపై ఈ సంస్థ చేసిన అధ్యయనాన్ని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించింది.గత 15 ఏళ్లలో భర్తలపై దాడులు ఐదింతలు పెరిగినట్టు అధ్యయనం పేర్కొంది. ప్రతి 1000 మంది మహిళల్లో 36 మంది భర్తలపై చేయిచేసుకుంటున్నారట. 2006లో మాత్రం ఈ సంఖ్య ఏడు మాత్రమే కావడం గమనార్హం. మనదేశంలో మహిళలకు మాత్రమే రక్షణ చట్టాలు ఉండడం కూడా పురుషులపై గృహహింస పెరగడానికి ఒక కారణమని అధ్యయనం పేర్కొంది. మద్యానికి బానిసైన భార్యలను వేధించడమే భర్తలపై దాడులకు ప్రధాన కారణమని అధ్యయనం వివరించింది.

# మంత్రి దామోదర్ రాజనర్సింహతో
# ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ -జెడ్ సందర్సన్ భేటీ


**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో డాక్టర్ కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ద్వారా నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహతో గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ జెడ్ సందర్సన్, గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా డిపార్ట్మెంట్ ఆఫ్ హెల్త్‌కు చెందిన ఉన్నత స్థాయి అధికారుల బృందం నగరంలోని ట్రైడెంట్ హోటల్‌లో సమావేశమయ్యారు.గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియాలో మెడికల్, పారామెడికల్ హెల్త్ కేర్ రంగాలలో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహతో చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏటా 8,515 మెడికల్ గ్రాడ్యుయేట్స్, 6,880 మంది నర్సింగ్ గ్రాడ్యుయేట్స్‌లతో పాటు 22,970 మంది పారా మెడికల్ కోర్సులను విజయవంతంగా పూర్తి చేస్తున్నారని వెల్లడించారు. హైదరాబాద్ నగరం మెడికల్ వ్యాల్యూ టూరిజం డెస్టినేషన్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్) ద్వారా నర్సింగ్, పారామెడికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రొఫెషనల్స్‌గా శిక్షణ ఇచ్చి వారు ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రానికి చెందిన మెడికల్, పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులకు



ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవడానికి గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియాతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ గవర్నమెంట్ ఆఫ్ వెస్ట్రన్ ఆస్ట్రేలియా హెల్త్ మినిస్టర్ అంబర్ జెడ్ సందర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జడ్ చో%శీ%గ్తూ, కమిషనర్ ఆర్.వి కర్ణన్, టామ్‌కామ్ సిఇఒ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ హైమావతి, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సిఇఒ విశాలాక్షి, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వాణి, డాక్టర్ శివరామ ప్రసాద్, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

## : సతీష్ గౌడ్



వరంగల్, ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలవడం ప్రారంభించారు. కలిసిన ప్రతివారు పార్టీలో చేరమని ఇటీవల సోషల్ మీడియా వేదికగా చేసుకుని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని సోమవారం మండల పార్టీ అధ్యక్షులు కోటగిరి సతీష్ ఓ ప్రకటన జారీ చేశారు. టేకుమట్ల మండలం ఆరెపల్లి గ్రామం నుంచి బిఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు చెప్పుకుంటున్నారని తెలిపారు. కొంతమంది బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేలని మర్యాద పూర్వకంగా కలిసి పార్టీలో చేరినట్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలను వారు తీవ్రంగా ఖండిస్తున్నామని వివరించారు. గ్రామ కాంగ్రెస్ కమిటీ, మండల కాంగ్రెస్ కమిటీకీ ఎలాంటి సమాచారం లేకుండా పార్టీలో చేరడం చెల్లదని చెప్పారు. పార్టీలో ఎవరు చేరాలన్న ఆ గ్రామ కమిటీల అభిప్రాయాన్ని ముందుగా పరిగణలోకి తీసుకుని మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగ్గరికి తీసుకువెళ్లి పార్టీలోకి స్వాగతించినప్పుడు మాత్రమే ఆ చేరిక చెల్లుతుందన్నారు. బిఆర్ఎస్ పార్టీలో 10 సంవత్సరాల పాటు వివిధ రకాలుగా బాధ్యతలను అనుభవించిన వారు ఆ పార్టీ ఓడిపోయిన వెంటనే గెలుపొందిన కాంగ్రెస్ పార్టీలోకి చేరాలని చూడడం అత్యాశ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని గ్రామీణ స్థాయి నుంచి ప్రతీ కార్యకర్త రేయింబవళ్లు శ్రమించి, కృషి చేశారని తెలిపారు. పార్టీ కోసం అలా పని చేసిన సొంత పార్టీ వారిని కాదని, బిఆర్ఎస్ పార్టీ నేతలను పార్టీలోకి ఆహ్వానించి, అధికార భాద్యతలు అప్పగించే అవకాశం ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర పార్టీల వారు కాంగ్రెస్ పార్టీలో చేరిక అయ్యే ప్రయత్నాలను కాంగ్రెస్ నాయకులంతా ఖండిస్తున్నారని తెలిపారు.

# మేడారం వాగులో గల్లంతైన భక్తుడు మృతి

### - మృతదేహాన్ని గుర్తించి వెలికి తీసిన పోలీసులు



మేడారం, ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త): మేడారం జాతర వనదేవతల దర్శనార్థమై వచ్చిన ఓ భక్తుడు మేడారం మాటేరు తోగువాగులో గల్లంతై మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. సోమవారం తాడ్వాయి మండల ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సీఐ కిరణ్ కుమార్ ఆదేశానుసారం తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. ఆ వాగులో లభ్యమైన భక్తుని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం 4 కిలోమీటర్ల దూరం సీఐ, ఎస్సై, పోలీస్ సిబ్బంది భాద్యతగా భావించి వారి భుజాలపై మిసుకెళ్ళి 108 ద్వారా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన భక్తుడు హైదరాబాద్ మలక్ పేటకు చెందిన రోహిత్ లాల్ గా పోలీసులు గుర్తించారు. ఇట్టి విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఏదైనా సమస్య వేస్తే మనకిచ్చిన తిప్పలు ఏంటని తప్పుకునే పరిస్థితుల్లో పోలీసులు తామే స్వయంగా మృత దేహాన్ని మోసుకెల్లి వారి విధులకు నిదర్శనమినిచ్చారు. ఈ సందర్భంగా తాడ్వాయి పోలీసులు మృతుని పట్ల వ్యవహరించిన భాద్యతలను తెలుసుకున్న పోలీస్ ఉన్నత అధికారులు వారిని అభినందించారు.


# బాధితులకు అండగా నిలవాలి

### - ఫిర్యాదులపై వేగంగా చర్యలు చేపట్టాలి
### - భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే ఐపీఎస్



**భూపాలపల్లి, ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** బాధిత ప్రజలకు అండగా నిలిచి, సమర్పించే పిర్యాదులపై వేగవంతంగా చర్యలు చేపట్టాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే ఐపీఎస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే వివిధ రకాల సమస్యలపై 16 మంది నుండి పిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ ప్రజాదివాస్ లో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్ ల అధికారులతో మాట్లాడారు. పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు చేపట్టాలన్నారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని పోలీసులు భరోసా కల్పించాలి, చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతలకు భంగం కలిగించేవారి పట్ల, మహిళలకూ వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులను వారు ఆదేశించారు.

# విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి



చిట్యాల, ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త): చిట్యాల మండల కేంద్రంలో సోమవారం బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్ అధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి పార్టీ చేపట్టిన విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈనెల 29వ తారీకు గురువారం రోజున భూపాలపల్లి నియోజకవర్గంలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానుందని చెప్పారు. బిజెపి పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విజయ సంకల్ప యాత్రను చిట్యాల మండలంలోని బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజా ఆదరణ పొందిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని మరోసారి ఎన్నుకోవాలని ఉద్దేశంతోనే దేశ ప్రజలు కోరుతున్నారు. ప్రతీ పౌరుడు ప్రధాని నరేంద్ర మోడీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన దేశాభివృద్ధి, ఇలా అనేక రకాల సంక్షేమ పథకాలు మళ్లీ దేశ ప్రజలకు అందాలంటే ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీని గెలిపిస్తేనే సాధ్యమౌతుందన్నారు. ఈసారి లోక్ సభ ఎన్నికల్లో 4 వందల సీట్లు భారతీయ జనతా పార్టీ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మూడవ సారి ముచ్చటగా నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర సభ్యులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి బిజెపి జిల్లా మండల సీనియర్ నాయకులు బూత్ అధ్యక్షులు శక్తి కేంద్ర ఇంచార్జీలు గుండ సురేష్, చెక్క నర్సయ్య, గజనల రవీందర్, పాలకుర్తి బిక్షపతి, శ్రీనివాస్ గౌడ్, రాయని శ్రీనివాస్, మైదం శ్రీకాంత్, అశోక్ చారి, సంపత్, వివేక్, వీరస్వామి, సుందర్, రమేష్, చింతల రాజేందర్, రావుల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండకు తరలించిన మేడారం హుండీలు



మేడారం, ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త): తాడ్వాయి మండలం మేడారం సమక్క సారలమ్మ మహా జారత దిగ్విజయంగా ముగిసింది. సోమవారం అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకల హుండీలను అధికారులు మేడారం నుంచి హనుమకొండకు తరలించారు. హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఈనెల 29 నుంచి హుండీలను లెక్కించనున్నారు. మేడారం జారతరకు చెందిన మొత్తం 512 హుండీలు ఉన్నాయి. ఈసారి నిర్వహించిన మహా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవార్ల దర్శనానికి క్రమక్రమంగా భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తూనే ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అతిపెద్ద ఆదివాసుల జాతరను అభివృద్ధి చేయడం కోసం కోట్ల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడం, సురక్షితమైన ప్రయాణం చేసే విధంగా రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేశారు. ఈసారి జాతరకు అందాద 1 కోటి 45 లక్షల మంది భక్తులు హాజరైనట్లు మంత్రి అనసూయ సీతక్క ప్రకటనలో వెల్లడించారు. ఆలెక్క ప్రకారం భక్తుల సంఖ్య పెరగినప్పుడు కానుకలు అధికంగా వచ్చే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.తీసుకెళ్లిన హుండీ కానుకలు దాదాపు 10 రోజుల పాటు లెక్కించనున్నారని తెలుస్తోంది.

# భాదిత కుటుంబానికి సోల్జర్ యూత్ సహాయం




రాయపర్తి, ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండలం గన్నారం గ్రామానికి చెందిన ఈరెల్లి ఉప్పలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం సోల్జర్ యూత్ అసోసియేషన్ సభ్యులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయంగా అందజేశారు.

ఈ పరామర్శలో సోల్జర్ యూత్ అధ్యక్షులు నందనబోయిన సాంబశివ, నందనబోయిన ప్రవీణ్, అబ్బరబోయిన మహేష్, మునిగేల శ్రీకాంత్, మునిగేల వంశీ, నందనబోయిన సాయికిరణ్, సాగర్, విక్కీ, ప్రభు తదితరులు ఉన్నారు.

# మార్చి 31లోగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు క్లియర్

### -లే అవుట్ల క్రమబద్ధీకరణకు అనుమతి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
### -దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టుల్లో ఉన్నవాటికి నో



హైదరాబాద్,ఫిబ్రవరి **26(జర్నలిస్ట్ వార్త):** ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.లే అవుట్ల క్రమబద్ధీకరణకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. గత 2020లో స్వీకరించిన లేవుట్ల క్రమబద్ధీకరణకు అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో భారీగా దరఖాస్తులు వెల్లు వెత్తాయి. వాటిని పరిశీలించిన ప్రభుత్వం మార్చి 31 వరకు క్రమబద్ధీకరణకు వీలు కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూము లను తప్ప ఇతర లే అవుట్స్‌ను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల మంది దరఖాస్తు దారులకు లాభం చేకూరనున్నది. లేఔట్ల భూములను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ విధానాన్ని తీసుకొచ్చింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసు కొచ్చిన ఎల్ఆర్ఎస్ వల్ల స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరింది. ఈ నేపథ్యంలో అనుమతి లేకుండా చేసిన లే అవుట్లలో కొనుగోలు చేసిన వారికి క్రమబద్ధీకరించుకునేందుకు సర్కార్ మరోసారి అవకాశం కల్పించింది. అనధికార లే ఔట్‌లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఇళ్లు నిర్మాణానికి అనుమతులు రాక, అటు అమ్ముకునేందుకు వీలు లేకుండా ఉండేది. ఈ క్రమంలో ఆ లే ఔట్లలో ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించడానికి గత ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్ తీసుకు రాగా ఈ విషయంపై కొందరు కోర్టులను ఆశ్రయించడంతో కొంతకాలం నుంచి ఈ పక్రియకు బ్రేక్ పడిరది. తాజాగా తెలంగాణ ప్రభుత్వం లే ఔట్ల కోసం ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి మార్చి 31లోగా క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించింది. కేవలం అనుమతి లేని లే ఔట్లను మాత్రమే ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

# రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు



**హైదరాబాద్,ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** రేపు 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ ఎగ్జామ్స్ జరుగనున్నాయి.ప్రశాంతంగా పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని ఇంటర్ బోర్డ్ సెక్రటరీ శృతి ఓజా తెలిపారు. సోమవారం విరీడియాతో ఆమె మాట్లాడుతూ%శా%రాష్ట్ర వ్యాప్తంగా 1521 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 9,80,978 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారని ఆమె చెప్పారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ స్టూడెంట్స్ 4,78,718 మంది, ఇంటర్ సెకండ్ ఇయర్ స్టూడెంట్స్ 5,02,260 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారన్నారు. పూర్తి స్థాయిలో స్టూడెంట్ ఫ్రెండ్లీగా ఏర్పాట్లు జరిగాన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు ఇది కేవలం ఒక పరీక్ష మాత్రమే అని గుర్తుంచుకోవాలన్నారు. కష్టపడి చదివారు%శా%విద్యార్థులు మానసిక ఒత్తిడి తీసుకోకుండా ప్రశాంతంగా ఎగ్జామ్ రాయాలని సూచించారు. కలెక్టర్లు, ఎస్పీలతో పరీక్షల నిర్వహణపై రివ్యూ చేయడం జరిగిందన్నారు. సీసీ కెమెరాలు, కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే విద్యార్థులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వంద శాతం సిలబస్ పూర్తి చేశామన్నారు. ఒక్క నిమిషం నిబంధన అమలు కంటే అందరూ 9 గంటలలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని..9 తరువాత అనుమతి లేదని తెలిపారు. 475 మంది ఇంటర్ పరీక్షల గురించి టెలి మానస్‌కి కాల్స్ చేశారన్నారు. ఈసారి కూడా ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ టీచర్స్‌ను ఇంటర్ బోర్డు పరీక్షల నిర్వహణకు తీసుకుంటున్నామని శృతి ఓజా వెల్లడిరచారు.

# కొలువుల భర్తీపై ఫోకస్

**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్ పార్టీ ఎ న్నికల మేనిఫెస్టోలో ప్రకటించిట్లుగా ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్ల జారీపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా ఉద్యోగార్థుల డిమాండ్ల మేరకు మొ దట టిఎస్‌పిఎస్‌సికి కొత్త చైర్మన్, సభ్యులను ని యమించి ప్రక్షాళన చేసిన సర్కారు, పారదర్శకం గా నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో నిరుద్యోగుల్లో ప్రభుత్వంపై భరోసా ఏర్పడింది. గత ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల ఫలితాలు వెల్లడించి, ఎంపికైన అభ్యర్థులకు వేగంగా నియామక పత్రాలు అందజేసిన ప్రభుత్వం, త్వరలోనే కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన 13 వేల మందికి పైగా, గు రుకులాల గ్రాడ్యుయేట్ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్లుగా ఉద్యోగాలు సాధించిన 1,997 మందికి, స్టాఫ్‌నర్సులు 7వేల 94 మందికి ప్ర భు త్వం నియామక పత్రాలను అందజేసింది. ఇప్పటి కే గ్రూప్ -4 ఫలితాలను విడుదల చేసిన ప్రభు త్వం త్వరలోనే నియామక పత్రాలు అందించనుం ది. ఇలా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుండటంతో నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నా యి. మొదటగా గ్రూప్-1 నోటిఫికేషన్లలో పోస్టుల సం ఖ్యను పెంచింది. గత ప్రభుత్వంలో 2022లోనే 503 పోస్టులతో నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షల నిర్వాహణలో అక్రమాలు, పేపర్ లీకేజీల కారణంగా గ్రూప్- 1 రెండుసార్లు రద్దయింది. దీనికి మరో 60 పోస్టులు పెంచి 563 పోస్టులతో నూతన నోటిఫికేషన్ విడుదల చేయగా, శుక్రవారం(పిబ్రవరి 23) నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మరోవైపు గత ప్రభుత్వంలోనే నోటిఫికేషన్లు జారీ అయ్యి, పరీక్షల నిర్వాహణలో ఆలస్యమవుతున్న గ్రూప్ -2, గ్రూప్ -3 నోటిఫికేషన్లలోనూ అదనపు పోస్టులు పెంచేందుకు టిఎస్‌పిఎస్‌సి యోచిస్తున్నట్లు తెలుస్తుంది. 2022లో విడుదలైన ఈ నోటిఫికేషన్ల ప్రకారం గ్రూప్ -2లో 783 ఖాళీలు, గ్రూప్- 3లో 1,360కి పైగా పోస్టులున్నా యి. 2022 నుంచి ఇప్పటివరకు ఏర్పడ్డ ఖాళీలను కలుపుకొని అదనంగా మరికొన్ని పోస్టులను కలిపి అనుబంధ నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు సమాచారం.



### త్వరలోనే మెగా డిఎస్‌సి ప్రకటన

గ్రూప్స్‌తో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ గా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేసే లా మెగా డిఎస్‌సిని నిర్వహిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గతేడాది 5,089 ఉ పాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు గతప్రభు త్వం నోటిఫికేషన్ జారీ చేయగా, 1,77,502 మం ది దరఖాస్తు చేసుకున్నారు. 2023 నవంబరు 20 నుంచి 30వ తేదీ మధ్యలో రాతపరీక్ష నిర్వహించా ల్సి ఉండగా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పరీక్ష నిర్వహించలేదు. కాగా అప్పట్లో 9,800 పోస్టులు ఉన్నప్పటికీ, రేషనలైజేషన్ ఆధారంగా నాటి ప్రభుత్వం 5,089 పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ అంశంపై దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం డిఇఒల ద్వారా రాష్ట్రంలోని ఖాళీలను తెలుసుకుంది. ఈ మేరకు పాత నోటిఫికేషన్‌ను అదనంగా దాదాపు 5 వేల పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్ ప్రకటించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ఇప్పటికే పాఠశాల విద్యాశాఖ పూర్తి చేసినట్లు తెలిసింది. త్వరలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండటంతో, అంతకు ముందే దాదాపు 11 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సర్కారు ఏర్పాట్లు చేస్తుందని విద్యావేత్తలు చెబుతున్నారు. అలాగే ప్రభుత్వంలోని అన్ని శాఖల్లోని ఖాళీలను గుర్తిస్తున్న ప్రభుత్వం పోలీసు, రెవెన్యూ, వైద్య, విద్యుత్, అటవీ, వ్యవసాయ తదితర రంగాలకు సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. వైద్యారోగ్య శాఖలో 5 వేల పోస్టులను భర్తీ చేయనున్నట్లు సమాచారం.

### వయోపరిమితి 46 ఏళ్లకు పెంపు

ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వయోపరిమితిని కూడా సడలించింది. ఉద్యోగార్థుల వయో పరిమితిని 44 ఏళ్ల నుంచి 46 ఏళ్లకు ప్రభుత్వం పెంచింది.అలాగే మేనిఫెస్టోలో ప్రకటించినట్లు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. దాంతోపాటు నోటిఫికేషన్ల జారీలో, పరీక్షల నిర్వాహణలో ఎలాంటి లోపాలు లేకుండా కోర్టు కేసుల్లో చిక్కకుండా నియామకాలు ఆలస్యం కాకుండా సర్కారు ముందస్తు చర్యలు తీసుకుంటోందని నిపుణులు చెబుతున్నారు.

# బీఆర్ ఎస్ దుకాణం బంద్ చేసే ఆలోచనలో బీజేపీ...!




**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణాలో బీఆర్ఎస్ వైభోగం అంతా గతం అవుతోంది. ఓడి మూడు నెలల సమయం అయింది. ఈ సమయంలోనే బీఆర్ఎస్ బాగా రాజకీయ ఇబ్బందులను ఫేస్ చేస్తోంది అని అంటున్నారు. అధికారాంతముల చూడవలె అన్నట్లుగా గులాబీ పార్టీ నిండా గుబులు కమ్ముకుంది. పార్టీ దశ దిశ అర్థం కాని పరిస్థితి ఉంది అని అంటున్నారు. ఒక్క ఓటమి వేయి అపజయాల సాటి అన్నట్లుగా ప్రస్తుత పరిస్థితి మారిపోయింది అని అంటున్నారు.

ఇదిలా ఉంటే కాంగ్రెస్ సీఎం గా యువ నేత రేవంత్ రెడ్డి దూకుడు చేస్తున్నారు. తనకు అందివచ్చిన అవకాశాన్ని ఆయన చక్కగా వాడుకుంటున్నారు. మూడు నెలల వ్యవధిలో ఆయన సీఎం గా తన గ్రాఫ్ ని మరింతగా పెంచుకుని ముందుకు సాగుతున్నారు. కాంగ్రెస్ పూర్తిగా బీఆర్ఎస్ మీద ఫోకస్ పెట్టేసింది. బీఆర్ఎస్ ని అన్ని రకాలుగా ట్రబుల్స్ కి గురి చేస్తోంది. ఆఖరుకు బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉంది అంటే బీజేపీ తో చేతులు కలుపుతారు అని ప్రచారం ఊపందుకుంటోంది. అయినా బీఆర్ఎస్ నుంచి ఎవరూ ఖండించడం లేదు సరి కదా మౌనంగా ఉంటున్నారు. అదే టైం లో కిషన్ రెడ్డి లాంటి వారు అవన్నీ తప్పుడు వార్తలు అంటూ బీఅర్ఎస్ తో పొత్తు ఏంటి అని తీసి పక్కన పెడుతున్నారు. అయినా సరే బీఆర్ఎస్ దీని గురించి ఏమీ అనకపోవడం చిత్రమే అని అంటున్నారు. దీనిని బట్టి బీఅర్ ఎస్ మనసులో బీజేపీతో పొత్తు ఉండాల్సిందే అన్న భావన ఉందని అంటున్నారు. అయితే ఈ విషయంలో ప్రచారం కూడా సాగుతోంది. ఫిబ్రవరి నాలుగవ వారంలో కేసీఆర్ ఢిల్లీ టూర్ పెట్టుకున్నారు అన్న వార్తలు అయితే వినిపించాయి. దాంతో కేసీఆర్ ఢిల్లీ ఫ్లైట్ ఎక్కి వెళ్లేది బీజేపీ పెద్దలను కలవడానికే అని కూడా అంతా వైరల్ చేశారు. చూస్తూంటే ఫిబ్రవరి నెల ముగిసిపోతోంది కానీ కేసీఆర్ మాత్రం ఢిల్లీ ఫ్లైట్ ఎక్కలేదు. దీనికి కారణం ఏమిటి అన్నది చూస్తే కనుక కేసీఆర్ కి మోడీ అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు అని మరో ప్రచారం సాగుతోంది. పీఎం అపాయింట్మెంట్ కుదిరితే కనుక కేసీఆర్ ఏనాడో ఢిల్లీకి వెళ్లి ఉండేవారు అని కూడా అంటున్నారు. ఇక బీఆర్ఎస్ విషయంలో కానీ కేసీఆర్ విషయంలో కానీ బీజేపీ కేంద్ర నాయకత్వానికి తెలంగాణా నాయకత్వం గట్టిగా చెప్పింది ఏంటి అంటే కేసీఆర్ తో ఎట్టి పరిస్థితులలలో పొత్తు పెట్టుకోవద్దు అని. పొత్తు కనుక ఉంటే గులాబీ తోటను మనమే మళ్లీ పెంచి పోషించిన వాళ్ళం అవుతాము అని. నిజానికి చూస్తే తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోంది. 2028 అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ చేసుకుని ఇప్పటి నుంచే రంగంలోకి దిగుతోంది. 2023 ఎన్నికల్లో అయితే బీఆర్ఎస్ బలంగా ఉంది, అధికారంలో ఉంది కాబట్టి కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ గా పోటీ సగింది. ఇపుడు విపక్షంలోకి బీఆర్ఎస్ వచ్చేసింది. దాంతో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ని ఢీ కొట్టాలీ అంటే బీజేపీ ఇపుడు బలమైన ఆల్టర్నేషన్ గా ముందుకు రావాలని చూస్తోంది. ఎటూ కేంద్రంలో 2024 తరువాత మూడవసారి అధికారంలోకి వస్తామన్న నమ్మకం అయితే బీజేపీకి ఉంది. కేంద్రం అండతో తెలంగాణాలో తాము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కొని ప్రధాన ప్రతిపక్ష పాత్రను పోషించాలని చూస్తోంది అని అంటున్నారు. ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే తొందరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో ఆ పార్టీ పెర్ఫార్మెన్స్ ఏంటో తెలిసిపోతుంది అని అంటున్నారు. తెలంగాణాలో కనుక బీఆర్ఎస్ కనీస మాత్రంగా అయినా ఎంపీ సీట్లను తెచ్చుకోకపోతే అపుడు రాజకీయం మొత్తం ఉల్టా అవుతుంది అని బీజేపీ భావిస్తోంది.అసలు ఎంపీ ఎన్నికల్లోనే బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగానే పోరు ఉంటుందని అది లాభిస్తుందని ఊహిస్తోంది. అలా కాంగ్రెస్ ని ఎదురొడ్డి తాము నిలిస్తే ఆటోమేటిక్ గా 2028 నాటికి తిరుగులేని శక్తిగా తెలంగాణాలో మారి అధికారంలోకి రావచ్చు అన్నదే బీజేపీ ఎత్తుగడగా ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తెలంగాణా ఎన్నికల తెర మీద అంతర్ధానం కావడమే బీజేపీ ఎపుడూ కోరుకునేది అని అంటున్నారు. అద్నుకే బీఆర్ఎస్ తో బీజేపీ పొత్తు వద్దు అనే తెలంగాణా బీజేపీ నాయకత్వం అంటోంది. కేంద్ర నాయకత్వం కూడా అదే మాట మీద ఉండడంతోనే కేసీఆర్ ఢిల్లీ టూర్ కి గ్రీన్ సిగ్నల్ రాలేదని, ఆయనకు మోడీ అపాయింట్మెంట్ దక్కలేదని ప్రచారం సాగుతోంది. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ ఎస్ కనుక గట్టిగా అరడజన్ సీట్లు సాధినకపోతే మాత్రం ఖేల్ ఖతం దుకాణం బంద్ అని బీజేపీయే దూకుడు చేసి మరీ గులాబీ తోటలో కాషాయ జెండాను పాతేసే అవకాశం ఉంటుందని అంటున్నారు.


# ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం

**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం నిర్ణయం తీసుకున్నారు. 8 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. ఎమ్మెల్యేల అనర్హతపై టీడీపీ, వైసీపీ పిటిషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.
ఆనం రామనారాయణరెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలను అనర్హులుగా ప్రకటించాలని వైసీపీ తన పిటిషన్ లో పేర్కొనగా... కరణం బలరాం, మద్దాలి గిరి, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేశ్ లను అనర్హులుగా ప్రకటించాలంటూ టీడీపీ తన పిటిషన్ లో కోరింది. ఇటీవలే అనర్హత పిటిషన్లపై విచారణ ముగిసింది. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్ తమ్మినేని సీతారాం న్యాయ నిపుణుల సలహా కూడా తీసుకున్నారు. అనంతరం ఆ ఎనిమిది మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటిస్తూ నిర్ణయం వెలువరించారు.



# రమణ దీక్షితులుపై టీటీడీ వేటు..

## తొలగించిన పాలకమండలి



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) గౌరవ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులుపై పాలకమండలి వేటువేసింది. టీటీడీ నుంచి ఆయనను తప్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈమేరకు సోమవారం టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. టీటీడీ, ప్రభుత్వం, అహోబిలం మఠం, అర్చకులు, జీయ్యర్లపై రమణ దీక్షితులు తీవ్ర వ్యాఖ్యలు చేశారని చైర్మన్ చెప్పారు. రమణ దీక్షితులు వ్యాఖ్యలపై సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో చర్చ జరిగిందని తెలిపారు. టీటీడీపై రమణ దీక్షితులు చేసిన వ్యాఖ్యల తీవ్రతపై చర్చించిన సభ్యులు.. ఆయనపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు వివరించారు. పాలకమండలి నిర్ణయం మేరకు దీక్షితులను టీటీడీ నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చైర్మన్ కరుణాకర్ రెడ్డి తెలిపారు. తిరుమలలో కొన్నేళ్లుగా అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయని రమణ దీక్షితులు ఇటీవల ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన ఆయన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తిరుమలలో క్రిస్టియానిటీ వేగంగా వ్యాప్తి చెందిందని, సీఎం జగన్ క్రిస్టియన్ కావడంతో ఆలయంలోనూ ఆ మతం వ్యాపిస్తోందని రమణ దీక్షితులు ఆరోపించారు. ఈవో ధర్మారెడ్డి సహా ఆలయ సిబ్బందిలో చాలామంది క్రిస్టియన్లు ఉన్నారని విమర్శించారు. ఈవో కుమారుడు చనిపోతే దహనం చేయకుండా ఖననం చేశారని విమర్శించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది. ఈ క్రమంలోనే రమణ దీక్షితులుపై తిరుమల పోలీస్ స్టేషన్ లో కేసు కూడా నమోదైంది.

# స్వల్ప ఊరట


**బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ పిటిషన్**

**విచారణను మూడు వారాలకు వాయిదా వేసిన సుప్రీం ధర్మాసనం**



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
స్కిల్ డెవలప్ మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు సుప్రీంకోర్టు స్వల్ప ఊరటను కల్పించింది. ఈ కేసులో చంద్రబాబుకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ను విచారించిన జస్టిస్ బేలా ఎం. త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఎన్నికల వ్యవహారాల్లో ఫుల్ బిజీగా ఉన్న చంద్రబాబుకు... విచారణ వాయిదా పడటం బిగ్ రిలీఫ్ గానే చెప్పుకోవచ్చు.స్కిల్ కేసులో గత ఏడాది సెప్టెంబర్ లో చంద్రబాబును అరెస్ట్ చేశారు. ఆ తర్వాత చంద్రబాబుకు విజయవాడలోని ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ఈ క్రమంలో ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇదే సమయంలో ఆయన బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో ఇరువైపు వాదనలు విన్న హైకోర్టు... చంద్రబాబుకు తొలుత తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత దాన్ని రెగ్యులర్ బెయిల్ గా మార్చింది. దీంతో, చంద్రబాబు బెయిల్ ను రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది.

# ప్రపంచంలో రోజు రోజుకు రక్షణ కరవవుతోంది : ఐరాస చీఫ్ హెచ్చరిక



**ఫిబ్రవరి 26(జర్నలిస్ట్ వార్త):**
జెనీవా: ప్రపంచ శాంతికి పునాది వంటి మానవ హక్కులపై ఎన్నో రకాలుగా దాడులు జరుగుతున్నాయని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు.కాంగో, గాజా, మయన్మార్, ఉక్రెయిన్, సుడాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతోన్న పోరాటాలు అంతర్జాతీయ చట్టానికి 'గుడ్డి కన్ను'గా మారుతున్నాయన్నారు. ఐరాస మానవ హక్కుల మండలి సమావేశంలో మాట్లాడిన ఆయన ప్రపంచంలో రోజురోజుకు రక్షణ కరవవుతోందని హెచ్చరించారు. మానవ హక్కులకు, ప్రపంచ శాంతికి అత్యంత గౌరవం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.'మన ప్రపంచం అత్యంత వేగంగా మార్పు చెందుతోంది. అనేక సంఘర్షణలు ఊహించని వేదనకు దారితీస్తున్నాయి. కానీ, మానవ హక్కులు మాత్రం తటస్థంగా ఉండిపోయాయి. రోజు రోజుకు ప్రపంచంలో రక్షణ కరవవుతోంది' అని ఐరాస చీఫ్ ఆవేదన వ్యక్తంచేశారు. మానవ హక్కులు శాంతికి పునాది వంటివని, ప్రస్తుతం వాటిపై ఎన్నో రకాలుగా దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు.గాజాలో ఉన్న పాలస్తీనా శరణార్థి శిబిరాన్ని తొలగించాలని ఇజ్రాయెల్ పేర్కొనడాన్ని వ్యతిరేకించిన గుటెరస్.. అక్కడ సహాయ కార్యక్రమాలకు అది వెన్నెముక వంటిదన్నారు. మరోవైపు అసత్య ప్రచారాలకు ఐరాస ఓ మెరుపు తీగలా, విధాన వైఫల్యాలకు బలిపశువుగా మారిందని ఐరాస మానవ హక్కుల చీఫ్ వోల్కర్ తుర్క్ ఆందోళన వ్యక్తంచేశారు.

# హార్దిక్ పాండ్యా రీఎంట్రీ..



గతేడాది వన్డే వరల్డ్‌కప్ సందర్భంగా (బంగ్లాదేశ్‌తో మ్యాచ్) గాయపడిన టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత కాంపిటేటివ్ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు.ముంబైలో జరుగుతున్న డీవై పాటిల్ టీ20 కప్-2024లో హార్దిక్ రిలయన్స్ 1 జట్టు తరపున బరిలోకి దిగాడు. 16 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో హార్దిక్ రిలయన్స్ టీమ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. బీపీసీఎల్‌తో ఇవాళ (ఫిబ్రవరి 26) జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ రెండు వికెట్లు తీయడంతో పాటు తన జట్టును ఉపయోగపడే అతి మూల్యమైన పరుగులు చేశాడు. ఛేదనలో 10వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్.. 4 బంతుల్లో 3 పరుగులు చేసి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బీపీసీఎల్ 15 ఓవర్లలో 126 పరుగులు చేయగా.. స్వల్ప లక్ష్య ఛేదనకు తడబడిన హార్దక్ సేన 8 వికెట్లు కోల్పోయి అతికష్టం మీద విజయం సాధించింది.హార్దక్ ప్రాతినిథ్యం వహిస్తున్న రిలయన్స్ జట్టులో నేహల్ వధేరా, తిలక్ వర్మ, పియూశ్ చావ్లా లాంటి ముంబై ఇండియన్స్ ప్లేయర్లు ఉన్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల జరిగిన ఐపీఎల్ ట్రేడింగ్‌లో హార్దిక్‌ను ముంబై ఇండియన్స్ గుజరాత్ నుంచి ట్రేడ్ చేసుకున్న విషయం తెలిసిందే. ముంబై యాజమాన్యం రోహిత్‌ను తప్పించి.. వచ్చీ రాగానే హార్దిక్‌కు కెప్టెన్సీ అప్పగించింది. త్వరలో ప్రారంభంకానున్న ఐపీఎల్ 2024 ఎడిషన్ కోసం హార్దిక్ కఠోరంగా శ్రమిస్తున్నాడు. హార్దిక్ ముంబై గూటికి చేరడంతో అతని స్థానంలో గుజరాత్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ ఎంపికయ్యాడు.

# నాలుగో టెస్టులో టీమిండియా విక్టరీ...
# 3-1తో సిరీస్ కైవసం

%రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా మరోసారి సొంతగడ్డపై అదరగొట్టింది. ఇంగ్లండ్ తో ఐదు టెస్టుల సిరీస్ ను మరో టెస్టు మిగిలుండగానే చేజిక్కించుకుంది. రాంచీలో జరిగిన నాలుగో టెస్టులో రోహిత్ సేన 5 వికెట్లతో అద్భుత విజయాన్ని అందుకుంది. 192 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది.
ఓ దశలో టీమిండియా 120 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడినట్టు కనిపించినా... శుభ్ మాన్ గిల్, ధ్రువ్ జురెల్ జోడీ ఆరో వికెట్ కు అజేయంగా 72 పరుగులు జోడించి టీమిండియా విజయాన్ని ఖాయం చేసింది. గిల్ 52, జురెల్ 39 పరుగులతో నాటౌట్ గా నిలిచారు. ఇంగ్లండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 3 వికెట్లు, రూట్ 1, టామ్ హార్ట్ లే 1 వికెట్ తీశారు. టీమిండియా రెండో ఇన్నింగ్స్ లో కెప్టెన్ రోహిత్ శర్మ 55, యశస్వి జైస్వాల్ 37 పరుగులు చేశారు. రజత్ పాటిదార్ (0), రవీంద్ర జడేజా (4), సర్ఫరాజ్ ఖాన్ (0) నిరాశపరిచారు.
ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ లో 353 పరుగులు చేయగా, టీమిండియా 307 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ ను రెండో ఇన్నింగ్స్ లో



టీమిండియా బౌలర్లు 145 పరుగులకు కుప్పకూల్చారు. అశ్విన్ 5, కుల్దీప్ యాదవ్ 4 వికెట్లతో ఇంగ్లండ్ పతనంలో కీలకపాత్ర పోషించారు. ఈ మ్యాచ్ మూడున్నరోజుల్లోనే ముగిసింది. రాంచీ టెస్టులో విజయంతో టీమిండియా ఈ ఐదు టెస్టుల సిరీస్ ను 3-1తో కైవసం చేసుకుంది. సిరీస్ లో తొలి టెస్టు హైదరాబాద్ లో జరగ్గా... టీమిండియా అనూహ్యరీతిలో పరాజయం పాలైంది. అయితే, ఆ తర్వాత విశాఖ, రాజ్ కోట్, రాంచీల్లో జరిగిన మూడు టెస్టుల్లో వరుసగా నెగ్గి సిరీస్ విజేతగా నిలిచింది. ఇక, ఇరుజట్ల మధ్య నామమాత్రమైన చివరిదైన ఐదో టెస్టు మార్చి 7 నుంచి ధర్మశాలలో జరగనుంది.




# ఓజీ గురించి క్యూట్ కామెంట్

పవన్ కళ్యాణ్ ప్రస్తుతం హరి హర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్ మరియు ఓజీ సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. అయితే ఆయన ఫ్యాన్స్ తో పాటు చాలా మంది సినీ ప్రేమికులు పవన్ ఓజీ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పవన్ కి బాగా సెట్ అయ్యే కథ అవ్వడంతో పాటు ఫ్యాన్స్ ఎలా అయితే చూడాలి అనుకుంటున్నారో అలాంటి కథ తో ఓజీ రూపొందుతోంది. సాహో సినిమా తో హిందీ ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసిన దర్శకుడు సుజీత్ దర్శకత్వంలో ఓజీ సినిమా రూపొందుతోంది. ఈ సినిమాలో హీరోయిన్ గా క్యూట్ బ్యూటీ ప్రియాంక అరుల్ మోహన్ నటిస్తున్న విషయం తెల్సిందే. ఈ సినిమా గురించి మరియు పవన్ గురించి ప్రియాంక ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రియాంక అరుల్ మోహన్ మాట్లాడుతూ... చాలా మంది ఓజీ గురించి ఎదురు చూస్తున్నారు. వారు అంతా కూడా ఆశిస్తున్నట్లు ఓజీ అద్భుతంగా వస్తుంది. కచ్చితంగా స్క్రీన్ పై చూస్తున్న సమయంలో అద్భుతమైన ఫీల్ ను పొందుతారు అంటూ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కి కిక్ ఇచ్చే వ్యాఖ్యలు చేసింది. ఇక పవన్ గురించి ప్రియాంక అరుల్ మోహన్ మాట్లాడుతూ... పవన్ గొప్ప వ్యక్తి. ఆయన గ్రేట్ లీడర్, లెజెండ్ అంటూ పొగడ్తల వర్షం కురిపించింది. మొత్తానికి ఓజీ పై ఉన్న అంచనాలను భారీగా పెంచేసింది. ప్రస్తుతం పవన్ ఎన్నికల హడావుడిలో ఉన్నాడు. అది పూర్తి అవ్వగానే మొదట ఓజీ పూర్తి చేసి, ఇదే ఏడాదిలో విడుదల చేసే ప్లాన్ చేస్తున్నారు

# లండన్ లో ఇంటిని అద్దెకు తీసుకున్న ప్రభాస్..





'సలార్' మూవీతో సూపర్ హిట్ కొట్టిన ప్రభాస్... మరో రెండు నెలల్లో 'కల్కి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. మే 9న ఈ చిత్రం పాన్ వరల్డ్ లెవెల్లో విడుదల కాబోతోంది. ఈ సినిమా తర్వాత కొన్నాళ్ల పాటు రెస్ట్ తీసుకోవాలని ప్రభాస్ భావిస్తున్నారు. మరోవైపు ప్రభాస్ గురించి ఓ ఆసక్తికర వార్త వైరల్ అవుతోంది. లండన్ లో ప్రభాస్ ఓ విలాసవంతమైన ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ప్రభాస్ అక్కడకు వెళ్లినప్పుడు ఉండేందుకు ఈ ఇంటిని అద్దెకు తీసుకున్నట్టు సమాచారం. ఇంటి అద్దె కూడా కళ్లు చెదిరే రీతిలో ఉంది. నెలకు అద్దె రూ. 60 లక్షలట. బాలీవుడ్ స్టార్లు ఎక్కువగా విదేశాల్లో గడుపుతుంటారు. ఇప్పుడు టాలీవుడ్ స్టార్లకు కూడా విదేశాలపై మోజు పెరుగుతోంది. మహేశ్ బాబు ఇప్పటికే దుబాయ్ లో ఓ ఇంటిని తీసుకున్నాడు. మరోవైపు కల్కి సినిమా ప్రమోషన్స్ ను మార్చి మధ్యలో ప్రారంభించబోతున్నారట. ఈ సినిమాలో దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి సూపర్ స్టార్లు నటిస్తున్నారు. ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.


# హీరో హీరోయిన్ గా 'పొన్నియన్ సెల్వన్' పిల్లలు





మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియన్ సెల్వన్ సినిమాలో భారీ తారాగణం నటించిన విషయం తెల్సిందే. అంత మంది నటించినా కూడా ఐశ్వర్యరాయ్ మరియు విక్రమ్ చిన్నప్పటి పాత్రల్లో నటించిన పిల్లలు మాత్రం అందరికి సుపరిచితంగా నిలిచారు. వారి పాత్రలు ఎప్పటికి గుర్తుండి పోతాయి అనడంలో సందేహం లేదు. ఐశ్వర్య రాయ్ పోషించిన నందిత పాత్ర చిన్నప్పటి పాత్రలో సారా అర్జున్ కనిపించింది. ఇక విక్రమ్ చిన్నప్పటి పాత్రలో సంతోష్ నటించాడు. సాదారణంగా బాల నటీ నటులుగా నటించిన వారు హీరోలుగా హీరోయిన్స్ గా నటించడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే పొన్నియన్ సెల్వన్ వచ్చి మూడు ఏళ్లు కూడా నిండా పూర్తి అవ్వలేదు అప్పుడే వారు హీరో హీరోయిన్ గా నటించేందుకు రెడీ అయ్యారు. మరో విశేషం ఏంటి అంటే పొన్నియన్ సెల్వన్ లో బాల నటులుగా జంటగా నటించిన వారు ఇప్పుడు హీరో హీరోయిన్ గా జంటగా నటించేందుకు రెడీ అవుతున్నారు. సనా మరియం దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో వీరిద్దరూ కలిసి హీరో హీరోయిన్ గా నటించబోతున్నారు. కొన్నాళ్లుగా సారా అర్జున్ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుందనే వార్తలు వస్తున్నాయి. అమ్మాయి ఇప్పుడు బాల నటిగా కాదు మంచి కమర్షియల్ హీరోయిన్ అన్నట్లుగా ఉందని ఇప్పటికే ఆమె ను చూసిన వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో సారా అర్జున్ అందమైన ఫోటోలు మరియు వీడియో లు వైరల్ అవుతున్నాయి. తాజాగా పొన్నియన్ సెల్వన్ జోడీ మళ్లీ రిపీట్ అవ్వబోతుంది అంటూ తమిళ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు వస్తున్నాయి. పొన్నియన్ సెల్వన్ తో వచ్చిన గుర్తింపు కారణంగా వీరిద్దరు హీరో హీరోయిన్ గా సక్సెస్ అవుతారేమో చూడాలి.

# నా పేరును రాజకీయంగా వాడుకోవద్దు : మోహన్ బాబు



తన పేరును కొందరు వ్యక్తులు రాజకీయంగా ఉపయోగించుకుంటున్నట్టు ఈ మధ్య కాలంలో తన దృష్టికి వచ్చిందని ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు తెలిపారు. దయచేసి ఏ పార్టీ వారైనా తన పేరును వారి స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని కోరుతున్నానని చెప్పారు. మనం అనేక భావావేశాలున్న వ్యక్తుల ప్రపంచంలో జీవిస్తున్నామని.. ఎవరి అభిప్రాయాలు వారివని, అది వారి వ్యక్తిగతమని అన్నారు. చేతనైతే నలుగురికి సాయపడటంలోనే మనం దృష్టి పెట్టాలిగానీ, సంబంధం లేని వారిని రాజకీయ పార్టీలలోకి, వారి వారి అనుబంధ సంస్థల్లోకి తీసుకురావడం బాధాకరమని చెప్పారు. తనకు అండదండగా ఉన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేస్తున్నానని... శాంతి, సౌభ్రాతృత్వాలను వ్యాపింపజేయడంలో అందరం బద్ధులై ఉందామని కోరుకుంటున్నానని తెలిపారు. తన విన్నపాన్ని ఉల్లంఘించిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా లేఖను విడుదల చేశారు.